క్లుప్తంగా

యోగా శిక్షకులకు మిజోరం గవర్నర్ అభినందన


యోగా శిక్షకులతో మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు

మహారాణిపేట: యోగాలో గ్లోబల్ వరల్డ్ రికార్డ్ సాధించిన యోగా శిక్షకులను మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం ఘనంగా సన్మానించారు. మహారాణిపేట నేచర్ క్యూర్ హాస్పిటల్ ఆవరణలో యోగా వరల్డ్ రికార్డును సాధించిన విశాఖ వాసులు శిష్యా శ్రీలక్ష్మి, నిర్వాహకురాలు ఎం.దుర్గామాధవి, వరలక్ష్మి, కృష్ణకుమారి, జి.రమణమూర్తి తదితరులను హరిబాబు సన్మానించారు.

నేడు, రేపు కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్: నగరంలోని రామ్‌నగర్ కేంద్రంగా గల వైద్యరాజ్ ఔషధాలయంలో ఈ నెల 19, 20 తేదీల్లో కేరళ ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు ఔషధాలయ మేనేజర్ దినూప్ ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఆ రెండు రోజులు ఔషధాలయంలో అందుబాటులో ఉండి, దీర్ఘకాల రోగాలకు పంచకర్మ విధానం ద్వారా కేరళ ఆయుర్వేద వైద్యం అందించనున్నట్టు పేర్కొన్నారు. చర్మవ్యాధులు, ఆర్థరైటిస్, సైనసైటిస్, సోరియాసిస్, ఒత్తిడి, ఈఎన్‌టీ సమస్యలు, హైపర్ టెన్షన్ (ఆందోళన), కీళ్ల వ్యాధులు, నడుంనొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి డాక్టర్ నాయర్ సేవలందిస్తారని తెలిపారు. డాక్టర్ అపాయింట్‌మెంట్ కోసం 91331 06060 నంబరులో సంప్రదించవచ్చని తెలియజేశారు.

నెమలి పింఛాలతో గౌరమ్మకు అలంకరణ


గౌరీపరమేశ్వరులకు పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వెలసిన గౌరీపరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా మూడో కార్తీక సోమవారం సందర్భంగా అమ్మవారిని నెమలి పింఛాలతో చూడచక్కగా అలంకరించారు. కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 23 వరకు గౌరమ్మ ఉత్సవాలు చేపడుతున్నామన్నారు. చివరి రోజున అత్యంత ఘనంగా ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

గౌరమ్మకు సారె సమర్పణ


గౌరమ్మకు సారె తీసుకెళ్తున్న మహిళలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై శ్రీ వెంకట గౌరీశంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గౌరీపరమేశ్వర్ల ఉత్సవాలకు పలువురు భక్తులు సోమవారం సారెలు సమర్పించారు. 33వ వార్డు సూరిశెట్టి పైడిరాజు వీధికి చెందిన మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు, మిఠాయిలు, కొబ్బరిబొండాలు, అరటి పండ్లు తదితర సారె సామగ్రిని తిరువీధి ఉత్సవం ద్వారా తీసుకెళ్లి అందజేశారు. గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు వారికి స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం అందజేశారు.

అక్రమ నిర్మాణం నిలిపేయండి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 31వ వార్డు భీమ్‌నగర్ సాయిబాబా గుడి వద్ద ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాలు నిలిపివేయాలని జైభీమ్ యువజన సేవా సంఘం నేతృత్వంలో స్థానికులు సోమవారం జోన్-4 కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో ఒకప్పుడు పబ్లిక్ వాటర్ ట్యాంక్ ఉండేదని, ప్రభుత్వ స్థలంలో కుమారి అనే మహిళ అక్రమంగా ఓ గది నిర్మాణాలు చేపడుతోందని పేర్కొన్నారు. అక్రమ నిర్మాణాలు నిలిపివేసి కబ్జాకు పాల్పడిన ఆమెపై చర్యలు చేపట్టాలని, ఆ స్థలంలో పబ్లిక్ వాటర్ ట్యాంక్ పునర్నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడా రత్నాలు



- విద్యతోపాటు క్రీడా పోటీల్లో రాణిస్తున్న పేదింటి విద్యా కుసుమాలు
- పతకాలతో సత్తా చాటుతున్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు
- బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన సబా టబాస్సుమ్
- వెయిట్ లిఫ్టింగ్‌లో రజతం గెలుచుకున్న అశ్విని

డాబాగార్డెన్స్: తల్లిదండ్రుల కష్టానికి **ఆ విద్యార్థినులు** ఫలితం చూపుతున్నారు. చదువు**తోపాటు క్రీడల్లో** చక్కగా రాణిస్తున్నారు. పాఠశాల, **కళాశాల స్థాయి** నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీ**లకు ఎదిగి అటు** విద్యా సంస్థకు.. ఇటు తల్లిదండ్రు**లకు పేరుప్రఖ్యా**తలు తెస్తున్నారు. క్రీడల్లో సత్తా **చాటుతూ విశాఖ** జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు. **వారే.. విశాఖ** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు. ఏ పోటీలో పాల్గొన్నా విజయం సాధిస్తున్నారు.

అంతా పేద, మధ్యతరగతి విద్యార్థినులే..

ఈ కళాశాలలో చదువుతున్నది పేద, మధ్యతరగతి పిల్లలే. వీరిలో మూడు పూటలా తిండి లేని వారు ఎందరో. తల్లిదండ్రులిద్దరూ కూలీ పనులు చేసుకుంటూ.. పిల్లలను చదివించుకుంటున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో చదివించే ఆర్థిక స్థోమత లేక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చదివిస్తున్నారు. వీరిలో అనేక మంది మురికివాడల్లో నివసిస్తున్నవారే. ఒక అశ్వినీ.. సబా టబాస్సుమ్.. ఇలా ఎందరో విద్యార్థినులు పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో విశాఖ పేరు నిలబెడుతున్నారు. బాక్సింగ్, వెయిట్ లిఫ్టింగ్, త్రోబాల్, వాలీబాల్, కోకో, టెన్నికాయిట్, కబడ్డీ ఇలా పలు ఈవెంట్లలో సత్తా చాటుతున్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి నేతృత్వంలో విద్యార్థినులు రాణిస్తున్నారనడానికి ఈ ఏడాది జరిగిన పోటీల్లో కళాశాలకు తెచ్చిపెట్టిన బహుమతులే నిదర్శనం.

జాతీయ స్థాయిలో సబా ప్రతిభ

మహిళా కళాశాలలో బీకాం ఫస్టియర్ చదువుతున్న సబా టబాస్సుమ్ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 8 నుంచి 10 వరకు మహారాష్ట్రలో జరిగిన రాణి లక్ష్మీబాయి ఫస్ట్ గరల్స్ అండ్ వుమెన్ ఆలిండియా బాక్సింగ్ ఇన్విటేషనల్ టర్నమెంట్‌లో 52–54 కిలోల విభాగంలో సబా టబాస్సుమ్ గోల్డ్ మెడల్ సాధించడమే గాక, బెస్ట్ ప్రామిసింగ్ బాక్సర్ అవార్డు గెలుచుకుంది.


బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన సబా టబాస్సుమ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మంజుల, ఫిజికల్ డైరెక్టర్ కిరణ్మయి

దూసుకుపోతున్న అశ్విని

ఆంధ్రా యూనివర్సిటీ ఇటీవల నిర్వహించిన అంతర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బీఎస్సీ(జువాలజీ) సెకండియర్ చదువుతున్న మజ్జి అశ్విని రజత పతకం సాధించింది. విశాఖ జిల్లా స్పోర్ట్స్ అథారిటీలో కోచ్ పూజారి శైలజ శిక్షణలో 2023–24లో ఏయూ ఇంటర్ కాలేజీయేట్‌లో కాంస్య పతకం సాధించిన అశ్విని ఈ ఏడాది 71 కిలోల వెయిట్ కేటగిరీలో రజతం గెలుచుకుంది. రెండు మోకాలి లిగ్‌మెంట్స్ సమస్యను అధిగమిస్తూ బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంటూ కళాశాల బోటనీ లెక్చరర్ మహాలక్ష్మి సహకారంతో అవసరమైన డైట్ తీసుకుంటూ, పట్టుదలతో ప్రాక్టీస్ చేస్తూ అశ్విని దూసుకుపోతుంది.


రజత పతకం సాధించిన అశ్వినిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

కళాశాలకు గర్వకారణం



మా కళాశాల విద్యార్థినులు విద్యతోపాటు క్రీడల్లో చక్కగా రాణిస్తున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపుతున్నారు. ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో సబా టబాస్సుమ్, మజ్జి అశ్వినిలు పతకాలు సాధించడం ఆనందంగా ఉంది. విద్యతోపాటు క్రీడల్లో సత్తా చాటుతూ ఇటు కళాశాలకు.. అటు తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెడుతుండటం ఎంతో గర్వకారణం.

–డాక్టర్ ఆర్.మంజుల,
ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో జీవీఎంసీకి వస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని కొంతయినా అరికట్టవచ్చని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె సోమవారం తమ క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా పరిష్కార వేదికలో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణ కోసం జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒకరోజు ప్రజా రవాణాను వినియోగిస్తోందన్నారు. ఎకో–వైజాగ్ అభివృద్ధి నేపథ్యంలో జీరో పొల్యూషన్ కార్యక్రమంలో భాగంగా జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం ద్వారా నగరంలో కాలుష్య నివారణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మాలధారుల అన్నదానానికి వాసుపల్లి విరాళం


ఆర్థిక సహకారం అందజేస్తున్న వాసుపల్లి

డాబాగార్డెన్స్: అయ్యప్ప, భవానీ తదితర మాలధారణ చేసిన వారికి అన్న సమారాధన కోసం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లోని వాసుపల్లి కార్యాలయంలో అల్లిపురం బంగారమ్మ మెట్ట కాలనీలో బూరెల చిన్న ఆధ్వర్యంలో మాలధారణ భక్తుల కోసం వాసుపల్లి ఈ విరాళం అందించారు. ఆయన మాట్లాడుతూ మాలధారులకు అన్నదానం, కైంకర్యానికి సహకారం అందించడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్ సనపల రవీంద్రభరత్, పార్టీ నాయకులు గనగళ్ల రామరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

20న మెగా మ్యూజికల్ నైట్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ముగ్గురు గాయనీమణులతో 'వేణు గానమ్ము వినిపించెనే' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు తెలిపారు. ఈ మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ఛాంబర్లో సోమవారం ఆమె చేతుల మీదుగా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. తిరుమలరావు మాట్లాడుతూ ఈ నెల 20న సాయంత్రం 4 గంటల నుంచి అక్కయ్యపాలెం దాలిరాజు సూపర్‌మార్కెట్ సమీపాన గల స్వరాలయ స్టూడియోలో నిర్వహించనున్న ఈ సంగీత విభావరిలో ప్రముఖ గాయనీమణులు కోమలీ ప్రసాద్, సుజాత కంఠ, ఎం.మాధురితో కలిసి రమేష్ పట్నాయక్, వీకే రాజు, మనోహర్, దేవరాజ్, సత్య, విశ్వప్రసాద్ పలు చిత్ర గీతాలు ఆలపించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, గాయకులు పాల్గొన్నారు.

ఏవీఎన్ కాలేజీలో ఘనంగా 'లియో ఫెస్ట్'


విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపాల్ సింహాద్రినాయుడు, ప్రొఫెసర్ ప్రసాద్

డాబాగార్డెన్స్: ఏవీఎన్ కళాశాలలో సోమవారం లియో ఫెస్ట్–2024 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, క్యారమ్స్, చెస్, క్విజ్ పోటీలతోపాటు సాహిత్య కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. లియో ప్రెసిడెంట్ పృథ్వీరాజ్ సమన్వయంతో కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. లయన్ ప్రొఫెసర్ ఎస్‌వీబీఎస్ఎన్ ప్రసాద్, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ సూర్యప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాలకు మల్టీ ఫంక్షన్ ప్రింటర్ అందజేశారు. కార్యక్రమంలో లియో ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎ.అర్చన, కిషోర్ గుప్తా, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, లయన్ సభ్యులు, లియో వలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న వాసుపల్లి కుటుంబం


సింహగిరిపై కుటుంబ సభ్యులతో వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: సింహాచలం సింహాద్రి అప్పన్నను సోమవారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ కుటుంబంతో సహా దర్శించుకున్నారు. మాతృమూర్తి అమ్మాజీ, భార్య ఉషారాణి, పెద్ద కుమారుడు సూర్య, సౌందర్యరాశి దంపతులు, సాకేత్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ సింహాచల పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమన్నారు. నృసింహస్వామి చల్లని చూపులతో విశాఖను కాపాడాలని వేడుకున్నారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలకు, మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబానికి చందనస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని వాసుపల్లి ఆకాంక్షించారు.

న్యాయవాది భైపా అరుణ్‌కుమార్‌కు అవార్డు


భైపా అరుణ్‌కుమార్‌ను ఆంధ్ర రత్న అవార్డుతో సత్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య 24వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని వేర్వేరు రంగాల్లో పలువురికి ఆంధ్ర రత్న అవార్డులు అందజేశారు. విశాఖ జిల్లా కోర్టు న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు భైపా అరుణ్‌కుమార్‌ను ఆంధ్ర రత్న పురస్కారంతో సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాలు, న్యాయవాద వృత్తి ద్వారా ప్రజలకు అందించిన సేవలను గుర్తిస్తూ ఆయనకు ఈ అవార్డును సమాఖ్య వ్యవస్థాపకుడు డాక్టర్ గణగళ్ల విజయకుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా భైపా మాట్లాడుతూ అవార్డుకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

కుటుంబ సభ్యుల చెంతకు నేపాల్ వాసి


కుటుంబ సభ్యులకు బహదూర్‌సింగ్‌ను అప్పగిస్తున్న శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు

సీతమ్మధార: మతిస్థిమితం సరిగా లేని నేపాల్‌లోని దదెల్దుర జిల్లా పారిగాన్ గ్రామానికి చెందిన ఉత్తమ్ బహదూర్ సింగ్ సెప్టెంబర్ 14న విశాఖ చేరుకున్నాడు. రైల్వే స్టేషన్ సమీపంలోని సిగ్నల్ పాయింట్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఉత్తమ్‌ను ఏయూటీడీ సంస్థ సిబ్బంది గమనించి ద్వారకానగర్‌లోని టీఎస్సార్ కాంప్లెక్సులోని జీవీఎంసీ–ఏయూటీడీ షెల్టర్‌కు తరలించారు. ఇంతవరకు ఇక్కడ చికిత్స అందజేసి.. నేపాల్‌లోని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు మాట్లాడుతూ ఉత్తమ్ నేపాల్‌లోని ఓ హోటల్‌లో కుక్‌గా పనిచేసేవాడని, పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడన్నారు. నాలుగేళ్లుగా వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ చివరకు విశాఖ చేరాడన్నారు. తమ సిబ్బంది కంట పడడంతో ఏయూటీడీ షెల్టర్‌కు తరలించి.. సపర్యలు చేశామన్నారు. శ్రద్ధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చికిత్స అందజేసి ఉత్తమ్ అక్క, బావ గాయత్రి సింగ్, దల్ బహదూర్‌కు అప్పగించామని శ్రద్ధ సోషల్ వర్కర్ షకీల్ అహ్మద్ తెలిపారు.

ప్రతిధ్వనించిన పంచాక్షరి



శివాలయాల్లో పంచాక్షరి ప్రతిధ్వనించింది. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని అభిషేక ప్రియుడికి భక్తులు నీరాజనాలు సమర్పించారు. అస్సాం గార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవస్థానంలో ఉమా చంద్రమౌళేశ్వర స్వామికి, డీబీకే రైల్వే క్వార్టర్స్‌లోని శ్రీ భవాని శంకర దేవాలయంలో, బౌడారా రోడ్డులోని శ్రీ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో, మురళీధ


రవీధి పంచముఖేశ్వర స్వామి దేవాలయంలో తెల్లవారు జాము నుంచి విశేష పూజలు చేశారు. సాయంత్రం దేవాలయ ఆవరణలో నిర్వహించిన ఆకాశ దీప పూజల్లో భక్తులు పాల్గొని, దీప దర్శనం చేసుకున్నారు. - అల్లిపురం

అలరించిన కవి సమ్మేళనం


అల్లిపురం శాఖ గ్రంథాలయంలో దేశభక్తి గీతం పాడుతున్న విద్యార్థిని


విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహిస్తున్న హెచ్ఎం మరియారత్నం తదితరులు


కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు

డాబాగార్డెన్స్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన కవి సమ్మేళనం అలరించింది. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సిహెచ్.వెంకటరావు మాట్లాడుతూ సమాజాన్ని ప్రభావితం చేయగల శక్తి కవులు, రచయితలపై ఉందన్నారు. జిల్లాలోని ప్రముఖ కవులు, రచయితలు కవి సమ్మేళనంలో వివిధ శీర్షికలతో కవితా గానం చేశారు. పద్యాలు, గేయాలు ఆలపించారు. గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కవులను ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ పాఠశాలల పిల్లలకు దేశభక్తి గేయాల పోటీలు ప్రేమా హైస్కూల్ ఉపాధ్యాయిని పి.ఉషారాణి నేతృత్వంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి లైబ్రేరియన్ రాజు, రాజేంద్రవర్మ, డిప్యూటీ లైబ్రేరియన్ పి.వి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

బాలల శాఖ గ్రంథాలయంలో..

పూర్ణా మార్కెట్ దరి రంగిరీజు వీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. ఆర్‌సీఎం కేథడ్రల్ స్కూల్ హెచ్ఎం బి.మరియారత్నం, ఇన్‌చార్జి సిస్టర్ స్వర్ణ జేవియర్, ఉపాధ్యాయులు జి.పుష్పలత, పి.జ్యోతికుమారి, జీవీ ఫాతిమారాణి, ఎస్.విజయకుమారి పోటీలు ప్రారంభించారు. గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి నేతృత్వంలో పోటీలు నిర్వహించారు.

ఆకట్టుకున్న దేశభక్తి గీతాల పోటీలు

అల్లిపురం: అల్లిపురం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. పిల్లలు ఉత్సాహంగా దేశభక్తి గీతాలు పాడి అలరించారు. ముఖ్య అతిథి జి.రామకృష్ణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రంథాలయాధికారి పి.వి.నూకరాజు మాట్లాడుతూ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం విద్యార్థులకు మహిళా చట్టాలపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 20న వారోత్సవాల ముగింపు సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ ర్యాలీ


జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: కార్గిల్ విజయ్ దివస్, వీర్ నారీలకు మద్దతుగా సోమవారం నగరంలో బైక్ ర్యాలీ జరిగింది. కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ర్యాలీని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. బీచ్ రోడ్డు మీదుగా ఎంవీపీ కాలనీలో ఉన్న సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. నేవీకి చెందిన చెంగలరావు, కృష్ణారావు, సీనియర్ వెటరన్ జగన్‌మోహనరావు, టీమ్ ఇన్‌చార్జి రమేష్, కో ఆర్డినేటర్ పి.వి.రావు, నార్త్ ఆంధ్రా వెటరన్ అసోసియేషన్ సభ్యులు, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో వ్యక్తిని రక్షించిన పోలీసులు

డాబాగార్డెన్స్: ఫిషింగ్ హార్బర్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం కాపాడారు. వివరాలివి.. మన్యం జిల్లాకు చెందిన ఓ వ్యక్తి ఫిషింగ్ హార్బర్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వన్‌టౌన్ సీఐ జీడీ బాబు స్పందించి, ఫిషింగ్ హార్బర్‌కు బీచ్ మొబైల్ హెచ్‌సీని బ్లూకోట్స్ పీసీని పంపించి కాపాడారు. ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం బంధువులను పిలిపించి అప్పగించారు.

మైనర్ బాలిక తల్లికి అప్పగింత

కుటుంబంలో మనస్పర్థల కారణంగా ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయిన మైనర్ బాలిక ఆచూకీని పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి, విచారణ చేపట్టారు. ఆ బాలికను విజయనగరంలో గుర్తించి, కౌన్సెలింగ్ ఇచ్చి ఆమె తల్లికి అప్పగించారు.

ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

మహారాణిపేట: జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. ఎన్‌క్యూఏఎస్ రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమాదేవి, రాష్ట్ర క్వాలిటీ కన్సల్టెంట్ సురేష్ పల్లా, రాష్ట్ర కన్సల్టెంట్ డాక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారుల ఎంఎల్‌హెచ్‌పీ శిక్షణ జరిగింది.

యాంటీ బయోటిక్ మందులపై అవగాహన ర్యాలీ


నీలిరంగు బెలూన్లు ఎగరేస్తున్న డాక్టర్ శివానంద, ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, వైద్యులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో సోమవారం ప్రపంచ యాంటీ బయోటిక్ మందులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పి.రత్నకుమారి నీలిరంగు బెలూన్లు ఎగురవేసి వారోత్సవాలను ప్రారంభించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద మొదలైన ర్యాలీ ఏఎంసీ మీదుగా తిరిగి కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బుచ్చిరాజు మాట్లాడుతూ యాంటీ బయోటిక్, యాంటీ ఫంగల్ మందులను వైద్యుల పర్యవేక్షణ లేకుండా వినియోగించడం వల్ల పలు రకాల వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. ఈ మందులకు కొరత కూడా సంభవించిందన్నారు. డాక్టర్ శివానంద మాట్లాడుతూ యాంటీ బయోటిక్ మందులను వైద్యుల సలహా మేరకు వినియోగించాలని, సరైన పద్ధతిలో వాడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్, డాక్టర్ శివ కల్యాణి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ స్వప్న, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ప్రజల సొత్తు


స్టీల్‌ప్లాంట్ దీక్షలకు మద్దతు తెలిపిన సీఐటీయూ జగదాంబ జోన్ శ్రేణులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు ప్రజల సొత్తు అని సీఐటీయూ సీనియర్ నాయకుడు వై.రాజు అన్నారు. దానిని అమ్మే హక్కు ప్రభుత్వానికి లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీపార్కులో చేస్తున్న దీక్షలు 1333వ రోజుకు చేరుకున్నాయి. సీఐటీయూ జగదాంబ జోన్ ప్రతినిధి సుబ్బారావు అధ్యక్షతన దీక్షల్లో సోమవారం పాల్గొన్న యూనియన్ సీనియర్ నాయకుడు వై.రాజు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశభక్తి పేరు చెప్పి దేశ సంపదను కారుచౌకగా ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వటం అన్యాయమన్నారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎవరి దయాదాక్షిణ్యాల ద్వారా వచ్చింది కాదని, ఇది ప్రజల సొత్తు అని పేర్కొన్నారు. ఈ ప్లాంట్‌ను అమ్మాలి అంటే వైజాగ్ ప్రజలందరి ఆమోదం కావాలని స్పష్టం చేశారు. కానీ, 1333 రోజుల నుంచి ప్రజలు ప్రైవేటీకరణ చేయొద్దని నిరసనలు తెలుపుతూ ఉంటే.. మరోవైపు ప్రభుత్వం 'ప్లాంట్‌ను మూసేస్తాం లేదా అమ్మనివ్వండి' అనే ఒక మొండి వైఖరి తీసుకోవటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి, హోటల్ యూనియన్ నాయకుడు ఎర్రి బాబు, హాస్పిటల్ యూనియన్ నాయకుడు నూకరాజు, సేఫ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ నాయకులు రాంబాబు, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికులకు రూ.26 వేలు వేతనమివ్వాలి

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు నెలకు రూ.26,000 జీతం ఇవ్వాలని, వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కేజీహెచ్ ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కమిటీ గౌరవాధ్యక్షుడు జె.వి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల శుభ్రతలో కీలక పాత్ర పోషిస్తున్న పారిశుధ్య కార్మికులకు కేవలం రూ.15వేలు జీతం ఇస్తూ వెట్టి చాకిరీ చేయిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం తక్షణం వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) వైస్ ప్రెసిడెంట్ జేడీ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు టీడీపీ నేతలు జీతం పెంపు విషయంలో హామీ ఇచ్చారని, అధికారంలో వచ్చాక ఇచ్చిన హామీ అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు, కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.ఎస్.జె. అచ్యుతరావు, కమిటీ సభ్యులు రాజేశ్వరి, సీహెచ్.వినోద్, చెన్నా అప్పలరాజు, జి .మంగమ్మ, కుమారి, తవిటిరాజు, జె. గణేష్, సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.